# ★ పవిత్ర హృదయం

**● శ్రీ వైజ్యుల లక్ష్మీనరసింహస్వామి**

> సాధారణంగా పురుషులే స్త్రీల పవిత్రహృదయాల్ని కలతపెడు తూంటారు దురూహాలతో. అటువంటి దురూహాలకు తావొసగక తన మనోనిశ్చయాన్ని ఎలా కాపాడుకుందో తెలియజేస్తుంది రాధ జీవితగాథ. ఎప్పుడేనా అటువంటి పవిత్రహృదయులు ప్రథమంలో ఎన్నిచిక్కులుపడ్డా చివరకు శాశ్వత సౌఖ్యాన్ని పొందగల్గుతారు.

చంద్రమోహన్ ఓ లక్షాధికారి. ఏభై సంవత్సరాలుంటాయి. యితని భార్య రేవతి. వీరికి సంతానము కలుగలేదు. యీ దంపతుల కా చింత ఒక్కటే గాని మరేలోపమూ లేదు.

ఓనాడు చంద్రమోహన్ సాయంకాలపు షైరుగా అలా పంట పొలాలవేపు కెళ్లాడు. ప్రకృతి కన్య నవనవలాడుతూ చిరునవ్వులతో ఆహ్వానిస్తోంది. అక్కడ ఓ రాతిగుట్ట వుంది. చంద్రమోహన్ ఏదో ఆలోచిస్తూ ఆ మెట్టపల్లున ఓ రాతిపై కూర్చున్నాడు. కొంతసేపటికి ప్రక్కనుండి మాసిన చింకిబట్ట కట్టుకొని ఓ పన్నెండేళ్ల పిల్ల యితనివద్దకు వచ్చి నిలపడింది బెదురుతోన్న చూపులతో. ఆ పిల్లలో ఓ అపూర్వ తేజస్సు యిమిడిఉన్నది. చంద్రమోహనా పిల్లని ప్రశ్నార్థకంగా చూశాడు. ఆ పిల్ల సద్దుమని లేనిసత్తువ తెచ్చుకుని—

'బాబూ! ఓ కానీ వుంటే యివ్వరూ? ప్రొద్దుట్నుండీ తిండిలేదు.'

'ఎవరిపిల్లవు నువ్వు?—' (ఓ కానీ యిస్తాడు)

'బాబూ! రామనాథ్ కూతుర్ని! నా చిన్నప్పుడే మా తల్లి చనిపోతే మా తండ్రి మళ్లీ పెళ్లిచేసుకున్నాడు. మా సవితల్లి నానాచిక్కులూ పెడుతుంది.'

'మీ సవితల్లికి పిల్లలున్నారా?'

'ఓ కొడుకున్నాడు—'

'మా యింట్లో వుంటావూ? నిన్ను పెంచుకొంటాం. చదువు చెప్పించి నీకు పెళ్లిచేస్తాను. నాకెవరూ సంతానంలేరు కూడా—నీకేం ఫర్వాలేదు.'

'మా తండ్రి యిష్టపడాలి.'

'అలాగే! మీ తండ్రిని ఒప్పిస్తా నెలాగయినా నీకిష్టమేనా?'

'ఇష్టమే—'

సంధ్యాచీకటి పడుతోంది. అప్పుడు చంద్రమోహన్ ఆ పిల్లను వెంటపెట్టుకుని వూళ్లోకి వెళ్లాడు.

♦ ♦ ♦ ♦

ఐదు సంవత్సరాలయింది. చంద్రమోహన్ తెచ్చిన పిల్లను ఆ దంపతులు అల్లారుముద్దుగా పెంచి చదువు చెప్పిస్తున్నారు. ముద్దుగా 'రాధ' అని పిలుస్తారా పిల్లని. రాధ యెప్పుడు నవనవలాడుతూ విద్యలోకూడా ప్రకాశిస్తోంది.

చంద్రమోహన్ ప్రక్కయింట్లో బాబూరావని ఓ కుర్రాడు స్కూలు ఫైనలు చదువుతున్నాడు. రాధకూడ స్కూలు ఫైనలే చదువుతోంది. బాబూరావు రాధ కప్పుడప్పుడు లెఖ్ఖలూ అవీ చెపుతూండేవాడు. ఇద్దరూ అరమరాభ్యంతరాలు లేకుండా మెలగుతూండేవారు నిర్మలహృదయాలతో.

ఓనాడు బాబూరావేదో చదువుకుంటున్నాడు యీజీఛెయిరులో కూచుని. అప్పుడు రాధ వీళ్లింటికొచ్చింది.

'మరేమిటి రాధా సంగతులు?'

'ఇవాళ ఫిల్ముకెళదామా? 'పుకార్'కి!'

'ఇద్దరమూ ఫిల్ముకు్కడానా వెళ్లటం?'

'ఏం? వెళితే తప్పా?'

'తప్పులేదు—పై వాళ్లేమనుకుంటున్నారో తెలుసా మన్ని?'

'అనుకోనీ!—మనకేం! మనలో అవుకు లేనప్పుడు ఎవళ్లెలా అనుకుంటే మనకేం?'

'సరే! అలాగే వెళ్దాం—'

'సాయంత్రం అయిదింటికి వస్తాను. సిధ్ధంగా వుండు నువ్వు. కారులో పోదాం.' అని వాళ్లింటి కెళ్లిపోయింది రాధ.

♦ ♦ ♦ ♦

కాలేజీలో S. S L. C. క్లాసు. క్లాసులో మగాళ్లు ఓవేపు కూర్చున్నారు. రాధ, మరో నలుగు రమ్మాయిలూ వేరే మరోప్రక్క కూర్చున్నారు. రాధ ప్రక్క లలిత అని మరో అమ్మాయి రాధ పుస్తకాలు చూస్తోంది. అందులో బాబూరావు కెమిస్ట్రీ నోటుబుక్కు చూసింది. వెంటనే మగాళ్లలో వున్న బాబూరావు వేపోసారి చూసింది. యింతలో స్కూలు వదిలేశారు. అంతా బయటికొచ్చేస్తున్నారు. లలిత రాధవద్దకు వచ్చి—

'రాధా నువ్వదృష్టవంతురాలవు సుమా!—'

'ఏం?'

నవ్వుతుంది—

'ఏం నవ్వుతావూ? చెపుదూ?'

'నువ్వు కెమిస్ట్రీ నోట్సుకేం కష్టపడకండానే లభిస్తాయి నీకు.'

'అదా సంగతి—ఏం తప్పా? బాబూరావుదగ్గర నోట్సు చూస్తే—?'

'అబ్బే తప్పులేదు. మీ యిల్లు అతనిల్లు ఓదగ్గరేకదూ. అంచాతే మీ యిద్దరికీ అంత చనువు.'

'అది కాకపోయినా బాబూరావు మాకు బంధువు కూడాను. వస్తాను లలితా!' అని రాధ యింట్లోకి పారిపోయింది.

రాధకు పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. పెళ్లికొడుకు B. A. పాసయి మదరాసులో Law చదువుతున్నాడు. రాధకూడా యీ సంబంధ మిష్టమే.

బాబూరావు రాధను బాగా ప్రేమించాడు. రాధమాత్ర మితణ్ణి సోదరుడికి మల్లే చూసేది. రాధకూడా ప్రేమ కలిగేలా చేసి యిరువురూ వివాహమాడాలని బాబూరా వుద్దేశం.

ఆవేళ సాయంత్రం బాబూరావొక్కడే పచారుచేస్తున్నాడు హాల్లో. అప్పుడు రాధ చేత్తో ఏదో పుస్తకం పట్టుకుని స్తరున లోనికొచ్చింది. 'ఓహో! పెళ్లికూతురు!' అంటూ బాబూరావు రాధతో లోపలి కెళ్లి తనగదిలో కూర్చున్నాడు. రాధ బాబూరావు వేపు ప్రశ్నార్థకంగా చూస్తోంది.

'రాధా! నీకు పెళ్లిలా వుందే?'

'ఎవరన్నారు?'

'ఎవరేనా అంటారు. నువ్వనకపోతే వుండిపోతుందా?'

'ఔను—' సిగ్గుపడుతుంది.

'రాధా! మనం చిన్నప్పటినుండి ప్రేమించుకోలేదూ?'

'ఔను ప్రేమించుకున్నాం—!'

'అయితే నువ్వు మరొకర్ని ఎలా వివాహమాడుతున్నావు?'

'అప్పటి మన ప్రేమ 'సోదరప్రేమ'. అలాంటప్పుడు వివాహానికి కవకాశం యేదీ?'

'నువ్విలాంటావనుకోలేదు రాధా! అయితే మన ప్రేమ భగ్నప్రేమే?'

'భగ్నప్రేమ ఎప్పటికీ కాదు—ఎప్పటికీ శిథిలముండని సోదరప్రేమ! నేనేం చేసేది బాబూరావూ! వస్తాను మళ్లీ!'

అని రాధ యివతల కొచ్చేసింది.

♦ ♦ ♦ ♦

చంద్రమోహన్ రాధకు వివాహం జరిగించేడు. రాధ భర్త మదరాసులో Law చదువుతున్నాడు. పేరు మురళీధర్. రాధను అతి గారాబంగా చూస్తున్నాడు.

ఇంతలో వేసంగి శలవులొచ్చాయి. మురళీధర్ అత్తవారింటికొచ్చాడు. రాధా మురళీధరులు ఓనాడు సాయంత్రం బీచికొచ్చారు. అక్కడ నీటివడ్డున వున్న చిన్న పడవలమీద యీ ప్రేమదంపతులు కూచుని యిష్టాలాపాలాడుకుంటున్నారు. ఒకరిద్దరు తప్ప బీచిలో యిప్పుడాట్టే జనం లేరు. దూరంగా పౌర్ణమీ చంద్రుడు వీరి విలాసానికి నవ్వుతున్నాడు. కొద్దిదూరంలో ఓ వెఱ్ఱివాడు కూడా నవ్వుకుంటూ బీచిలో తిరుగుతున్నాడిటూ అటూ, మధ్య మధ్య ఏవో మాటలంటున్నాడు పైకి. యీ వెఱ్రివాణ్ణి చూడగానే ఓసారి రాధమాత్రం గతుక్కుమంది. మరెవడూ కాడీ వెఱ్రివాడు—! బాబూరావు!!

---